

వర్షం.. నష్టం..

- నేలకొరిగిన వరి
- తడిసి ముద్దయిన పత్తి
- రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీరు
- రాకపోకలకు ఇబ్బందులు

ఓదెల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన భారీ వర్షానికి వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, కనగర్తి, నాంసానిపల్లి, లంబాడ తండా తోపాటు పలు గ్రామాల్లో గాలితో కూడిన భారీ వర్షానికి వరి పంటలు నీట మునిగాయి. అలాగే సేకరణకు సిద్ధంగా ఉన్న పత్తి పంటలో నీరు చేరి తీవ్ర నష్టానికి గురిచేశాయి. ప్రస్తుతం పాల దశ దాటి ఇప్పుడిప్పుడే గొలుసు దశకు చేరుకుంటున్న వరి పంటలలో నీటి వరదలు, వర్షానికి నేలమట్టమై పంటలు ఉపయోగం లేకుండా పోయాయి. భారీ వర్షానికి ఓదెల, ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిల్లోకి నీరు చేరింది. దీంతో కొమిర, పొత్కపల్లి, మండల సరిహద్దు గ్రామమైన ఉప్పరపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. యాసంగి బోనస్ కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రస్తుతం చేతికి వందే వచ్చే సమయంలోనే వరి పంటలు నేలమట్టం కావడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. మరో వారం రోజుల వరకు పత్తి సేకరణ పూర్తి కావస్తున్న సమయంలోనే వర్షాలు పడటంతో నాణ్యమైన కాటన్ రంగు మారి తక్కువ ధర పలికే పరిస్థితి ఉంది. అలాగే చివరిగా వేసిన ప్రతి పంటలు చేతికి అంది వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం ముందు సాగు చేసిన పతి పంటలు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.


ఎలిగేడులో నేలవాలిన వరి

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సుమారు రెండు గంటలపాటు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఈదురుగాలులు, పిడుగులతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమై నీటితో నిండిపోయాయి. అలాగే వర్షం ధాటికి పొలాలు నేలకొరిగాయి. దీంతో రైతులు పొట్ట దశలో ఉన్న పొలాలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. మరికొన్ని పొలాలు పాలు పోసే దశలో ఉండగా వర్షం వల్ల ఆశించిన దిగుబడి రాకపోవచ్చని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఓదెలలో నీట మునిగిన వరి పంట

అండర్ బ్రిడ్జితో ప్రయాణికుల కష్టాలు

- వరదనీటిలో చిక్కుకున్న ట్రాక్టర్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లిలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో వరద నీరు చేరి ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ యజమాని ట్రాక్టర్‌తో నీటి నుంచి దాటే ప్రయత్నం చేయగా వరద నీటిలోనే మునిగిపోవడంతో ట్రాక్టర్‌ను వదిలి బయటపడ్డారు. వరద నీరు బయటికి వెళ్తే కాని ట్రాక్టర్ బయటకు రాని పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఇబ్బందులు ఏర్పడుతున్నా సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, అవగాహన లేకుండా బ్రిడ్జి నిర్మించి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. వరద నీరు ఉండటంతో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలతో పాటు, కొత్తపల్లి గ్రామానికి వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. అండర్ బ్రిడ్జిలో వరదనీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


కొత్తపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటిలో చిక్కుకున్న ట్రాక్టర్

మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి


వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకల కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పలు శాఖల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. కాకా వెంకటస్వామి అనేక పదవులను అధిరోహించారని, ఆయన జయంతి ప్రభుత్వ పరంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. వెంకటస్వామి అందించిన స్ఫూర్తితో మనందరం పని చేయాలని, విధులు నిర్వహించే సమయంలో అట్టడుగు వర్గాల వారికి మన వంతు సహకారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఎంతో మంది పేదలకు ఆపన్నహస్తం అందించిన మహనీయుడని కొనియాడారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటస్వామి తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం పరితపించారని, కోల్ బెల్ట్ ఏరియాలోని కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. జిల్లా అధికారులు ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి రవీందర్, జిల్లా క్రీడల అధికారి సురేష్, ఆర్డీఓలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ పాలన అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు ప్రకాష్, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క - సారలమ్మ జాతర పనులను వేగవంతం చేయండి


జాతర ప్రాంగణంలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గోదావరి వంతెన వద్ద జనవరిలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర పనులను వేగవంతం చేయాలని అధికారులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. ఆదివారం జాతర ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సమ్మక్క - సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగవద్దని, మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని, నాణ్యతతో కూడిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గద్దెల నిర్మాణం వేగవంతం చేయాలని, మంచినీటి సౌకర్యం, రోడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యాల పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, గడ్డం శ్రీనివాస్, దూళికట్ట సతీష్, ముస్తాఫా, గట్ల రమేష్ ఉన్నారు.

చీకట్లో ప్రయాణికుల ఇబ్బందులు


ఓదెల రైల్వే స్టేషన్‌లో చీకట్లో ఉన్న ప్రయాణికులు

ఓదెల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రయాణికులు చీకట్లో ఇబ్బందులకు గురయ్యారు. గాలి, వర్షానికి ఆకస్మాత్తుగా రైల్వే స్టేషన్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రెండు గంటలకు పైగా ప్రయాణికులే ప్లాట్‌ఫామ్‌ల పైనే తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిర్పూర్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా రావడంతో వందలాది మంది ప్రయాణికులు రైల్వే స్టేషన్లో, హోటళ్ల వెంట కాలక్షేపం చేస్తూ ఇబ్బందులకు గురయ్యారు. మూడు గంటల తర్వాత విద్యుత్ సరఫరా కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

కిటకిటలాడిన మాంసం, మద్యం దుకాణాలు


మాంసం దుకాణాల వద్ద జనం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం మద్యం, మటన్, చికెన్, చేపల దుకాణాల వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడింది. గణేష్, దుర్గాదేవి నవరాత్రులు రావడం, శనివారం దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం చేశారు. దీంతో ఆదివారం మద్యం, మాంస ప్రియులు దసరా వేడుకలను జరుపుకున్నారు. కొత్త కూరగాయల మార్కెట్, మటన్, చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. మాంసం వ్యాపారులు మటన్ కిలో రూ.900, చికెన్ రూ.260 విక్రయించారు. బొమ్మె చేపలు రూ.400 నుంచి రూ.500 ధర పలికింది.

చిత్రకారుడిగా రాణిస్తున్న గాజుల నవీన్
- ఎవరి చిత్రమైన అవలీలగా వేయగల దిట్ట 4

ప్రశ్నార్థకంగా వన్యప్రాణుల మనుగడ
- యథేచ్ఛగా అడవులు, గుట్టలు విధ్వంసం... 4
- ఆహారం కోసం జనావాసాల్లోకి ఎలుగుబంట్లు, కోతులు, నెమళ్లు, అడవి పందులు
- నామమాత్రంగానే వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- కొనసాగుతున్న జాతీయ వన్యప్రాణి సప్తాహం

మంథనిలో ఆపరేషన్ మంకీస్

- కోతుల బెడదకు చెక్ పెడుతున్న వైనం
- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు

మంథని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టారు. కొద్ది రోజులుగా మంథని పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఆపరేషన్ మంకీస్ కొనసాగుతుంది. కోతుల బెడద పై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ అధికారులు వాటి పట్టుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఆంధ్రాలోని నెల్లూరు ప్రాంతానికి చెందిన కోతులు పట్టే వారిని ఇక్కడి రపించారు. దీంతో వారు సుమారు 400 పైగా కోతులను పట్టుకొని బోన్‌లో బంధించారు. కాలేజీ గ్రౌండ్, బొక్కలవాగు కట్ట, బోయినిపేటతోపాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. అందులో ఆహారం పెట్టగా కోతులు అందులోకి వెళ్ళగానే బోన్ గేట్ ఆటోమెటిక్‌గా పడేలా ఏర్పాట్లు చేసి కోతులను పడుతున్నారు. ఇలా మంథని ప్రాంతంలో ఉన్న కోతులను బంధించడానికి ప్రణాళికబద్దంగా ముందుకు సాగుతున్నారు. పట్టుకున్న కోతులను అడవిలో వదిలి పెడుతున్నారు. పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో కోతుల బెడద విపరీతంగా పెరగడం, దాడులు, బెదరింపులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు, గుంపులుగా ఆహారం కోసం ఇండ్ల మీద పడుతున్నాయి. ఇండ్లలోకి వచ్చి తినుబండారాలు ఎత్తుకు పోవడం, షాపుల్లోకి వచ్చి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. వీటి అడ్డుకొని, బెదిరించే ఇండ్లలోని వారి పై దాడులకు సైతం తెగబడుతున్నాయి. వీటి దాడిన పడి చాలా మంది ఆసుపత్రుల పాలయ్యారు. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిలోకి, పరిసరాల్లోకి ఎప్పుడు ఎలా వస్తాయో తెలియక జనం ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో ఆపరేషన్ మంకీస్ ద్వారా కోతులను బంధిస్తుండటంతో ఇన్ని రోజులు వాటితో అనేక విధాలుగా ఇబ్బందులు పడ్డ జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.


బోన్‌లో బంధించిన కోతులు

అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

హామీలు అమలు చేయకుండా మోసం ● కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ప్రతీ గడపకు తీసుకువెళ్తాం..

గోదావరిఖని, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అని, అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వంచించింది రేవంత్ సర్కారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం తిలక్‌నగర్ డౌన్‌లోని చందర్ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోరుకంటి చందర్, నాయకులు కౌశిక హరి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రత్యక్షంగా సంతకాలు చేసిన అభయహస్తం కార్డు పేరిట ప్రతి ఇంటికి అందించి నమ్మబలికి ఎన్నికల్లో గెలిచాక హామీలను అమలు చేయడం లేదని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారిందని మండిపడ్డారు. 420హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, 100రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఆడపిల్లలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ కార్యకర్తలు బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మోసాలతో విసిగిపోయిన ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోవు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం డివిజన్‌లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను అందించారు. మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, చెలకలపల్లి శ్రీనివాస్, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ఇం జపురి నవీన్ కుమార్, మెతుకు దేవరాజ్, నారా యణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, మేడి సదానందం, దొమ్మేటి వాసు. సట్టు శ్రీనివాస్ బుర్ర వెంకటేష్, ఇరుగురాళ్ల శ్రావణ్, కోడి రామకృష్ణ, సారయ్య నాయక్, కొర్రీ ఓదెలు, సంధ్యారెడ్డి, చింటూ, కనకలక్ష్మి, గుర్రం పద్మ, రామరాజు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

సింగరేణీయులకు వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గోదావరిఖని, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఏరియా హాస్పిటల్‌లో జీఎం లలిత్ కుమార్ ఆధ్వర్యంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి అంబికా పర్యవేక్షణలో హైదరాబాద్ ఒమేగా హాస్పిటల్ వారిచే గుండె నరాలు, కిడ్నీ యూరాలజీ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అంబికా మాట్లాడుతూ నెలలో రెండుసార్లు సూపర్ స్పెషాలిటీ క్యాంపు నిర్వహించి సింగరేణి కార్మికులకు, విశ్రాంత కార్మికులకు వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఎస్‌ఓటు జీఎం చంద్రశేఖర్, డీవైసీఎంఓ ప్రసన్న కుమార్, ఒమేగా హాస్పిటల్ స్పెషలిస్ట్ డాక్టర్లు, సింగరేణి ఏరియా హాస్పిటల్ డాక్టర్లు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జీడుల శ్రీనివాస్, పీఓఏ మురళి, మార్టిన్ నిర్మల కుమారి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వస్త్ నారి... సశక్త్ పరివార్‌తో మహిళలకు ఆరోగ్య భరోసా

- ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యులతో క్యాంపులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా స్వస్త్ నారి .. సశక్త్ పరివార్‌కు శ్రీకారం చుట్టగా పెద్దపల్లి మండలంలోని రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యులతో క్యాంపులు నిర్వహించారు. ఆరోగ్యకరమైనా మహిళలే బలమైన కుటుంబానికి ఆధారమనే లక్ష్యంతో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మహిళలు, యువతుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఈ పథకంలో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు శ్రవణ్‌కుమార్ తెలిపారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్య పరీక్షలు, గైనకాలజీ, అన్ని రకాల వైద్య సేవలు ఇలా నాలుగు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో సుమారు 300 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఇందులో తీవ్ర అనారోగ్యంతో ఉన్న 40 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.


రాగినేడు పిహెచ్‌సిలో ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌వో వాణి శ్రీ (ఫైల్)

శిబిరాల్లో ప్రత్యేక వైద్య సేవలు

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా అవగాహన కల్పించి వివిధ శిబిరాల్లో వైద్య నిపుణులు ఆరోగ్య సేవలను అందించారు. ప్రధానంగా ప్రసూతి, చిన్న పిల్లలు, ఈఎన్‌టీ, కంటి, దంత, చర్మవ్యాధి సమస్యలపై వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో హిమోగ్లోబిన్ స్థాయి, బీపీ, మధుమేహం, క్యాన్సర్, టీబీ, స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. వీటితో పాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించి అతివల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. మహిళలు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయని అవగాహన కల్పించారు.

పరిశుభ్రత ఉండాలి

- వైద్యులు శ్రవణ్‌కుమార్, రాగినేడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు 4 ప్రత్యే వైద్య శిబిరాలు నిర్వహించాం. శిబిరాల్లో మహిళలకు వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి మాత్రలను అందించాం. ప్రధానంగా సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

- యథేచ్ఛగా అడవులు, గుట్టలు విధ్వంసం...
- ఆహారం కోసం జనావాసాల్లోకి ఎలుగుబంట్లు, కోతులు, నెమళ్లు, అడవి పందులు
- నామమాత్రంగానే వన్యప్రాణి సంరక్షణ చర్యలు
- కొనసాగుతున్న జాతీయ వన్యప్రాణి సప్తాహం



ప్రశ్నార్థకంగా వన్యప్రాణుల మనుగడ

గుట్టలను, అడవులను ఆవాసాలుగా చేసుకుని జీవిస్తున్న వన్యప్రాణులకు రక్షణ లేకుండా పో యింది. గుట్టల ధ్వంసం, అడవుల నరికివేత, మరో వైపున వేటగాళ్ళ ముప్పుతో వ్యన్యప్రాణులు సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతున్నది. కొన్ని అరు దైన జాతుల పక్షులు, జంతువులు దాదాపు అంత రించిపోయే స్థితికి చేరుకున్నాయి. అక్టోబరు 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి సప్తాహం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వన్యప్రాణులపై కథనం..

- కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి)

వన్యప్రాణులు, వనాలను రక్షించుకోవాలంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు రెండు ఉంచి వారం రోజుల పాటు వన్య ప్రాణుల సంరక్షణ వారోత్స వాల పేరిట అధికారులు ర్యాలీలు, విద్యార్థులకు క్విజ్ పోటీలతో సరిపెడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు నిర్దిష్టంగా చేపట్టాల్సిన బాధ్యతలను మాత్రం విస్మరిస్తున్నారు. రోజు రోజుకు వనాలు నరికివేస్తుండడంతో పక్షులు, అటవీ జంతువులు వాటి ఆవాసాలను కోల్పోతున్నాయి. సహజసి ద్ధంగా లభించే ఆహారం దొరకని పరిస్థితి నెలకొ న్నది. అటవీ ప్రాంతంలో స్వేచ్ఛగా తిరగాల్సిన వన్యప్రాణులకు నీరు, ఆహారం లభించక జనావా సాల్లోకి ప్రవేశించి ప్రాణాలు కోల్పోతున్నాయి.

● తీవ్రమైన కోతుల బెడద

కరీంనగర్ జిల్లాలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల హుజురాబాద్‌లో కోతులదాడిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వందలాది మందిపై దాడి చేసి గాయపరిచాయి. అడవి పందులు గ్రామాల్లో పంటపొలాల్లోకి వెళ్లి చేతికివచ్చిన పం టలు మొక్కజోన్న, పల్లికాయ, పెసర, పొద్దు తిరుగుడు, పత్తికాయలను తినేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతున్నది. కొంతకాలం క్రితం మంథని ప్రాంతంలో హైదరా బాద్‌కు చెందిన నలుగురు జింకలను వేటాడి వెళు తుండగా పోలీసులకు చిక్కారు. వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1972 ప్రకారం అడవి జంతు వులను చంపిన వారికి కఠిన శిక్షలున్నప్పటికీ ఆ యాక్ట్‌ను అమలు చేయడంలో అధికారులు విఫల మవుతున్నారు.

● ఉమ్మడి జిల్లాకు వరంగల్ రెస్క్యూ టీమే దిక్కు

అటవీ జంతువులు దారి తప్పి జనావాసాలకు చేరితే వాటిని బంధించి సురక్షితంగా అడవికి చే ర్చాలి. ప్రాణాంతకమైన జంతువులైతే సంబం ధిత అటవీశాఖ అధికారులు వెంటనే అటవీశాఖకు చెందిన సెంట్రల్ రెస్క్యూ టీంలకు సమాచారం అందించాలి. హైదరాబాద్ జూ లేదా వరంగల్ నుంచి రెస్క్యూటీం సంఘటనా స్థలానికి చేరుకుని మత్తు ఇంజక్షన్ల ద్వారా ఆ జంతువులను బంధించి తిరిగి సురక్షితంగా అటవీ పాంతంలో వదిలి వేయాలి. హైదరాబాద్ లేదా వరంగల్ నుంచి రెస్క్యూ టీం రావడానికి చాలా సమయం పడు తోంది. అప్పటి వరకు జరగాల్సిన నష్టం జరిగిపో తోంది. ఉమ్మడి జిల్లాకు ఒక ట్యాంకిలైజర్ గన్, ట్రాపర్ వెహికల్, రెస్క్యూటీం ఉండాలని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటిని ఎవరూ పట్టించుకోలేదు.

● భల్లూకాల ఆవాసాలు ఛిద్రం....

ఎలుగుబంట్లు సాధారణంగా అటవీ ప్రాంతంలో సంచరించి చెట్ల ఫలాలు, తేనె, చీమలు, వివిధ రకాల పురుగులను, మట్టిలో ఉండే పలు రకాల దుంపలను ఆహారంగా తీసుకుంటాయి. కరీంనగర్ జిల్లాలో తరచుగా ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. పలుసార్లు కరీంనగర్ జిల్లా కేంద్రంలోనూ ఎలుగుబంట్లు సంచరించడం నగరవాసులను ఆందోళనకు గురి చేస్తోంది. కరీంనగర్ పరిసరాల్లోని గుట్టల్లో ఎలుగుబంట్లు వందల సంఖ్యలో స్థావరాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. గ్రానైట్ క్వారీల ఏర్పాటుతో వాటి ఆవాసాలు ధ్వంసమవుతున్నాయి. గుట్టల్లో నిత్యం పేలుళ్లు జరపడంతో ఎలుగుబంట్లు జనావాసాల్లోకి చొరబడి అడ్డువచ్చిన వారిపై దాడులు చేస్తున్నాయి.



చాలా సందర్భాల్లో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు ఎలుగుబంట్ల దాడిలో గాయపడుతున్నారు. మరో వైపు అటవీ ప్రాంతం, గుట్టలలోని స్థావరాలను వదిలి గ్రామాల్లోకి వస్తున్న ఎలుగుబంట్లు, నెమళ్లు, జింకలు, తదితర వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడి, కొన్ని సందర్భాల్లో ప్రజల చేతిలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ నాంపల్లి సతీష్ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. సతీష్ పదేళ్లుగా ఆటో నడుపు తూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కొనుగోలు, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.6లక్షలు అప్పులుచేశాడు. ఆటోవల్ల ఉపాధి అంతంతా మాత్ర మే కావడంతో ఓవైపు బాకీల బాధలు.. మరోవైపు పోషణ తలకు మించిన భారంగా మారింది. దీంతో మనస్థాపం చెందిన సతీష్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య చేరుకుని ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆయనవెంట ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, సాగర్, భాస్కర్, తిరుపతి, దేవరాజు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికిచెందిన కోల సతీష్(38) మద్యానికిబానిసై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ బతుకుదెరువు కోసం నాలుగేళ్ల కిందట గల్ఫ్‌దేశం వెళ్లి తిరిగివచ్చాడు. అప్పటినుంచి పనిదొరకక ఖాళీగాఉంటూ మద్యానికి బానిస య్యాడు. దీంతో ఆర్థికసమస్యలు మొదలై మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని సతీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

యువకుడిపై దాడి

కోరుట్ల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో శనివారం అర్ధరాత్రి దుంపేట రాజేష్ అనే యువకుడిపై తలారి వినయ్ అనేవ్యక్తి బీరుసీసాతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం తలారి వినయ్, దుంపేట రాజేష్‌లు మద్యం సేవిస్తున్న క్రమంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజేష్‌ను వినయ్‌చేతిలో ఉన్న బీర్‌సీసాతో దాడి చేయడంతో మెడ ప్రాంతంలో తీవ్రగాయం కాగా స్థానికులు చికిత్స నిమిత్తం కోరుట్ల పట్టణంలోని ఓ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాజేష్‌ను కోరుట్ల నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుప్రతికి తరలించారు. కాగా రాజేష్, వినయ్ మధ్య పాతపగలు ఉన్నట్లుబంధువులు పేర్కొంటున్నారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదారాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా శివధర్‌రెడ్డి బాధ్య తలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పుష్పగుచ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలిపారు.



డీజీపీ శివధర్ రెడ్డితో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

‘సర్దుబాటు’పై లోకాయుక్తను ఆశ్రయించిన ఉపాధ్యాయుడు

● 10న హాజరుకావాలంటూ డీఈవోకు నోటీసు జారీ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి చేపట్టిన సర్దుబాటు బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఓ ఉపాధ్యాయుడు లోకాయుక్తను ఆశ్రయించాడు. సర్దుబాటు కోసం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా తనపై కక్ష సాధింపుతో బదిలీ చేశారని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వఉన్నతపాఠశాల ధన్గర్‌వాడీ లో పనిచేస్తున్న స్కూల్‌అసిస్టెంట్ హిందిపండిట్ ఎండీ జావీద్‌హుస్సేన్ ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. ఈ తప్పును సవరించాలని డీఈవోను కోరినా న్యాయం జరుగక పోవడంతో గత్యంతరం లేక లోకాయుక్తను ఆశ్రయించానన్నారు. జూన్18న జిల్లావిద్యాశాఖ అధి కారి చేపట్టిన టీచర్ల సర్దుబాటులో తనకంటే జూని యర్ పాఠశాలలో ఉండగా తనను సర్దుబాటులో బదిలీచేశారని తెలిపారు. విద్యార్థులసంఖ్యను పరిశీ లించి బదిలీ చేయాల్సి ఉండగా దాన్ని పట్టించుకోలే దని, జూనియర్‌ను బదిలీ చేయకుండా తనను బదిలీ ఎలా చేస్తారని అన్నారు. దీనిపై జిల్లావిద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించినా పట్టించుకోలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాను జూలై 22న లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు చేశానని, దీనిపై స్పందించిన లోకాయుక్త ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు తన కార్యాలయంలో హాజరుకావాలంటూ జిల్లా విద్యాధికారికి, తనకు నోటీసు జారీ చేసిందని చెప్పారు. రెండోసారి చేపట్టిన సర్దుబాటులో మళ్లీ తనకంటే జూనియర్ ఉన్నప్పటికీ తనను మరోసారి వేరే పాఠశాలకు సర్దుబాటు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారన్నారు. శనివారం తనను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రిలీవ్‌చేశారని, తనకు రెండో సారికూడా అన్యాయం చేశారని ఆవేదనవ్యక్తం చేశా రు. లోకాయుక్తలో తనకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని, జిల్లా విద్యాశాఖ అధికారులు డీఎస్ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇలా సర్దుబాటులో అనేకమంది ఉపాధ్యాయులకు అన్యా యం చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై విచారణ జరి పించి, నిబంధనల మేరకు సర్దుబాటు జరిగేలా లోకా యుక్త, డైరెక్టర్‌ఆఫ్‌స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు న్యాయం చేయాల్సిన అవసరముందని, నిబంధనలు పాటించని అధికారులపైచర్యలుతీసుకోవాలని కోరారు.

గంజాయి స్వాధీనం

● ఇద్దరు యువకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కారం శ్యాంకుమార్, రేసు అక్షయ్‌ను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి 160గ్రాముల ఎండు గంజాయిని స్వాధీ నపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆది వారం తెలిపారు. తాము గస్తీకాస్తున్న క్రమంలో ఇద్దరు యువకులు అనుమానా స్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసు కున్నామన్నారు. వారిని విచారించగా హైద రాబాద్‌లో గంజాయిని తక్కువ ధరను కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకు వచ్చారని చెప్పారు. వారివద్ద నుంచి గంజాయిని స్వాధీనపర్చుకుని కేసునమోదు చేసి అరెస్ట్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చెరువులో పడి యువకుడి మృతి

జమ్మికుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన పీట్ల రాజశేఖర్(28) అనే యువకుడు చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి ఆదివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ పదిసంవత్సరాలుగా ఫిట్స్, అనారోగ్యసమస్యలతో బాధపడుతున్నాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్‌రావడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డా డు. ఈమేరకు మృతుడితల్లి కేశమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

రామగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూర్ గ్రామానికి చెందిన చిందం శారద(38) అనేవివాహిత జ్వరంతో ఆది వారం మృతి చెందింది. పదిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న శారద కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. జ్వరంతోపాటు ఇన్ఫెక్షన్ సోకడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపి నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతురాలి భర్త గ్రామపంచాయ తీలో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. శారద మృతిపై కుమార్‌యాదవ్, చిందం మహేష్, దామెర శ్రీనివాస్, మురళీకృష్ణ, ముత్యాల శ్రీనివాస్, పంజాలశ్రీనివాస్‌లు పెరు మాండ్ల ప్రసాద్, కుంట సమ్మయ్యలు సంతాపం తెలిపారు.



శారద(ఫైల్)

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన గంట వెంకటేశ్వర్‌రెడ్డి(82) ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెంకటేశ్వర్‌రెడ్డి సింగ రేణిలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యాడు. కొంత కాలంగా మానసికస్థితి బాగా లేకపోవడంతో ఆదివారం తెల్లవారుజామున ఇంటిపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఆయన తలకు బలమైన గాయం కాగా గోదావరిఖని ప్రభు త్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు గంట శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేశ్వర్‌రెడ్డి(ఫైల్)

వివాహిత అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండల పరిధి లోని విద్యారణ్యపురిలో నివాసం ఉంటున్న సిరిపురం చంద్రకళ (35) అనేవివాహిత ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతిచెం దింది. ఆదిలాబాద్‌కు చెందిన సంతోష్‌కు ఊట్నూర్‌కుచెందిన చంద్రకళతో కొంతకాలం కిందట వివాహమైంది. అనంతరం భార్యా భర్తల మధ్యగొడవలు తలెత్తాయి. ప్రస్తుతం వారు విద్యారణ్యపురిలో కొడుకుతో కలిసి నివసిస్తున్నారు. ఆదివారం ఉదయం చంద్రకళకు ఫిట్స్‌వచ్చాయి. ఆస్ప త్రికి తీసుకెళ్లగా గుండెపోటుతో మరణించిందని వైద్యులు వెల్లడించారు. తన కూతరు మరణంపై అనుమానం ఉందని మృతురాలి తండ్రి పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులోపేర్కొన్నాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



చంద్రకళ(ఫైల్)

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు గట్టయ్య మృతి

శంకరపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ గ్రామానికిచెందిన తెలంగాణ ఉద్యమకారుడు సుంకరి గట్టయ్య(70) ఆది వారం అనారోగ్యంతో మృతిచెందాడు. సుంకరి గట్టయ్య తెలంగాణ ఉద్యమసమయంలో 360రోజులు తెలంగాణకొరకు తాడికల్ దీక్ష శిబి రంలో నిరసన దీక్షలో పాల్గొన్నారు. అంతేకాకుండా రాస్తారోకోలు, ధర్నా లో పాల్గొని యువతలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



ఈదులగట్టెపల్లి-ఖాదర్‌గూడెం గ్రామాల మధ్య ఉన్న ఇరుకు వంతెన

మానకొండూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మా నకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి- ఖాదర్ గూడెం గ్రామాల మధ్య నుంచి వెళుతున్న కాకతీయ ప్రధానకాల్వపై నిర్మించిన వంతెన ఇరుకుగా ఉండడ ంతో ఆయాగ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ప డుతున్నారు. ఈ వంతెన పైనుంచి రెండు గ్రామాల కు చెందిన రైతులు పండించిన ధాన్యాన్ని ఇళ్లకు తీసుకెళుతుంటారు. సుమారు 45ఏళ్ల క్రితం కాకతీ య కాల్వ నిర్మాణంలో రెండు గ్రామాల ప్రజలు వె ళ్లేందుకు ఈ వంతెనను నిర్మించారు. ఈ వంతెనపై ఎడ్లబండి, ద్విచక్ర వాహనాలు మినహా మరే ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వంతెన శిథి లావస్థకు చేరుకోవడమే కాకుండా ఇరుకుగా ఉండ డంతో ఉపయోగం లేకుండా పోయిందని ఆయాగ్రా మాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్ర తినిధులు, అధికారులు స్పందించి రెండు గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన వంతెన ను నిర్మించాలని కోరుతున్నారు.

విస్తరణకు నోచుకోని అయిలాపూర్ రహదారి

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అయిలాపూర్ రోడ్డు

కోరుట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డు విస్తరణలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో వాహన దారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 30 సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేసినా పనులు ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వహయాంలో ఆదిలాబాద్ నుంచి మొదలై కోరుట్ల పట్టణంలోని అయిలపూర్ రోడ్డు మీదుగా వేములవాడ రహదారిని కలు పుతూ వేములవాడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను చేపట్టారు. డబుల్ రోడ్డు నిర్మాణం కోసం అయిలాపూర్ రోడ్డులోని నివాసాలతోపాటు వ్యాపా రులకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ నుంచి నోటీసు లను జారీచేశారు. కానీ విస్తర్ణ పనులు మాత్రం మొదలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలి..

- సుదవేణి మహేష్, బీజేపీ నాయకుడు, కోరుట్ల

అయిలాపూర్ రోడ్డును విస్తరణ చేసి అభివృద్ధిపర చాలి. నిత్యం రద్దీగా ఉండే రహదారిని విస్తీర్ణం చేసి ట్రాఫిక్ సమస్యలను పరి ష్కరించాలి. 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహ దారి విస్తర్ణకు అధికారులు చర్యలు చేపట్టాలి.



బావిలో పడి ఒకరి మృతి

మల్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పంప్‌మోటార్ మరమ్మతులు చేస్తుండగా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన ఊకంటి శ్రీపాల్‌రెడ్డి(47) అనే ఎలక్ట్రీషియన్ ఆదివారం బావిలోపడి మృతిచెందాడు. గ్రామానికిచెందిన మిర్యాల అవంతికిచెందిన వ్యవ సాయబావి పంప్‌మోటార్ మరమ్మతుకోసం బావి వద్దకు శ్రీపాల్‌రెడ్డివెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవ శాత్తు కాలుజారి పక్కనేగల బావిలోపడి మృతిచెం దాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్ద నక్కలపేట గ్రామానికి చెందిన బగ్గి లక్ష్మి(50) అనేమహిళ కారు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం సాయంత్రం మృతిచెందింది. వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న లక్ష్మిని ధర్మపురి నుంచి బీర్పూర్ వైపు వెళుతున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని చికిత్స కోసం అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో ఆదివారం ఉరి వేసుకొని గుండెపల్లి పద్మ(50) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లాకు చెందిన గుండెపల్లి పద్మ(50) రెండు సంవత్సరాల క్రితం వెల్లుల్ల గ్రామానికి వలస వచ్చింది. గ్రామంలో ఒంటరిగా ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం పద్మ ఉంటున్న ఇంటి తలుపులు మూసి ఉండడంతో స్థానికులు తెరిచి చూడగా ఇంటిలో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్రకారుడిగా రాణిస్తున్న గాజుల నవీన్

● ఎవరి చిత్రమైన అవలీలగా వేయగల దిట్ట

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాజుల నవీన్ చిత్రకారుడిగా ఎదిగి ఎన్నో అద్భుతమైన బొమ్మలు గీశాడు. సీనరీ, వ్యక్తి బొమ్మ చూసినా అవలీలగా వేయగల దిట్ట. ఇంటర్‌తోపాటు డ్రాయింగ్‌లో టీటీసీ చేసిన నవీన్ రకరకాలుగా బొమ్మలు గీసి అబ్బుర పరుస్తున్నాడు. కొందరు తమ ముఖచిత్రాలను నవీన్ ద్వారా గీయించుకొని పారితోషకం కూడా ఇస్తున్నారు. ఎవరి వద్ద శిక్షణ లేకుండానే బొమ్మలు వేయడంలో నైపుణ్యం సాధించాడు. కొందరు ఆర్టిస్టులు పెయింట్స్‌తో మాత్రమే బొమ్మలను వేస్తే, నవీన్ మాత్రం పెన్సిల్, కార్బన్, వుడ్ బర్నింగ్, థ్రెడ్ తదితర వాటి ద్వారా వివిధ రకాల బొమ్మలను గీస్తున్నాడు. అలాగే బర్నింగ్ ఆర్ట్‌తో బొమ్మ వేసి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు అందజేసి అభినందనలు చూరగొన్నారు. పలు రకాల బొమ్మలను వేయడంలో ఆరితేరిన నవీన్, ఎవరికైనా బొమ్మలు వేయించుకోవాలంటే తనను సంప్రదించాలని పేర్కొంటున్నాడు.



ఆంజనేయుని చిత్రపటాన్ని కరీంనగర్ కలెక్టర్‌కు అందజేస్తున్న నవీన్



తాను వేసిన చిత్రాలు చూపిస్తున్న నవీన్

స్వతహాగా బొమ్మలు వేయడం నేర్చుకున్నా

- గాజుల నవీన్, కాల్వశ్రీరాంపూర్

స్వతహాగానే బొమ్మలు వేయడం నేర్చుకున్నాను. ఇంటర్ తర్వాత డ్రాయింగ్‌లో టీటీసీ చేశాను. పెన్సిల్‌తోగాని, దారం, చెక్కతో కూడా బొమ్మలు వేస్తాను.



నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆయాదేవాలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం పక్షాన ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

● కొండగట్టులో భక్తుల ఇక్కట్లు

మల్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధికి వచ్చే భక్తులసౌకర్యార్థం భక్తులసేవాసమితి ఆధ్వర్యంలో వాహన పూజషెడ్డుకు సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. పనులు పూర్తై నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభించడం లేదని వెంటనే మరుగుదొడ్లను ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.



కొండగట్టుపైన గల మరుగుదొడ్లు

జీవధార.. శ్రీరాంసాగర్



- దశాబ్దాలుగా కళకళలాడుతున్న ఎస్సారెస్పీ
- 47 ఏళ్లుగా ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో
- అత్యధికంగా 1983లో... అత్యల్పంగా 1987లో..

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు దశాబ్దాలుగా నీటితో కళకళలాడుతోంది. 47 ఏళ్ల ప్రాజెక్టు చరిత్రలో రెండేళ్ల మాత్రమే అతి స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1983 నుంచి వరదలు ప్రారంభ మయ్యాయి. గడిచిన 47 ఏళ్లలో 10 సంవత్సరాలు మాత్రమే స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. 1987, 2015 సంవత్సరాల్లో మాత్రమే ప్రాజెక్టు నీటి మట్టం డెడ్ స్టోరేజీ (5 టీఎంసీలు) కన్నా తక్కువ నీటి మట్టానికి పడిపోయింది. కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది ప్రాజెక్టు నిండుకుండలా మారుతుండగా మిగులు జలాలు దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1983 నుంచి వరదలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 సంవత్సరాలు మాత్రమే ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కన్నా తక్కువ ఇన్‌ఫ్లో వచ్చింది. 1985-86లో 85.64 టీఎంసీలు, 1987-88లో 4.4 టీఎంసీలు, 1992-93లో 58.74 టీఎంసీలు, 2003-04లో 54.02 టీఎంసీలు, 2004-05లో 19.07 టీఎంసీలు, 2019-10లో 27.34 టీఎంసీలు, 2010-11లో 27.53 టీఎంసీలు, 2012-13లో 54.37 టీఎంసీలు, 2014-15లో 14.77 టీఎంసీలు, 2015-16లో 4.42 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

కాలువలు, ఎత్తిపోతలు	విడుదల చేసిన నీరు (టీఎంసీలలో)
కాకతీయ కాలువ	21.15
సరస్వతీ కాలువ	2.088
లక్ష్మీ కాలువ	0.458
వరద గేట్ల ద్వారా	647.509
ఎస్కేప్ గేట్ల ద్వారా	15.382
ఆవిరి	5.064
అలీసాగర్ ఎత్తిపోతల పథకం	0.521
గుత్పా ఎత్తిపోతల పథకం	0.255
మిషన్ భగీరథ	2.515
వరద కాలువ	50.548
మొత్తం అవుట్ ఫ్లో	745.49

● 1983లో 1,165టీఎంసీలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 1983 సంవత్సరంలో వరద నీరు వచ్చి చేరింది. ఆ సంవత్సరంలో 1,165 టీఎంసీల వరద నీరు డ్యామ్‌లోకి వచ్చింది. దీంతో వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు నుంచి భారీగా నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అత్యల్పంగా 1987 సంవత్సరంలో 4.4 టీఎంసీలు, 2015 సంవ త్సరంలో 4.42 టీఎంసీల నీరు వచ్చింది. డ్యామ్‌లోకి అత్యధికంగా 1988-89 సంవత్సరంలో 912.95 టీఎం సీలు, 1989-90 సంవత్సరంలో 576.28 టీఎంసీలు, 1990-91లో 687.69 టీఎంసీలు, 1998-99లో 552.44 టీఎంసీలు, 2005- 06లో 374.42 టీఎంసీలు, 2006-07లో 515.48 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

(2025 అక్టోబరు 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు)

నెలలు	వచ్చిన వరద (టీఎంసీలలో)	విడుదల చేసింది
జూన్	4.485	1.602
జూలై	24.488	1.749
ఆగస్టు	249.617	222.16
సెప్టెంబరు	425.614	434.837
అక్టోబరు	108.552	85.143
మొత్తం	812.755	745.49

● ప్రస్తుత యేడాది 812.755 టీఎంసీల నీరు రాక

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద ప్రస్తుత సీజన్‌లో పోటెత్తింది. డ్యామ్‌లోకి ప్రస్తుతం భారీగా వరద నీరు వస్తోంది. దీంతో కొన్ని రోజులుగా వరద గేట్లు పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని భారీగా వదులుతున్నారు. రికార్డు స్థాయిలో దిగువకు మిగులు జలాలు విడుదల చేస్తున్నారు. కాల్వలు, ఎత్తిపోతల ద్వారా పంటల కోసం నీటిని వదులుతున్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు ఎగువ నుంచి ఏకంగా 812.755 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అవసరమైన నీటి మట్టాన్ని నిల్వ చేస్తూ కాలువలు, ఎస్కేప్, వరద గేట్ల ద్వారా 745.49 టీఎంసీల నీరు విడుదల చేశారు. ఇందులో వరద గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి 647.509 టీఎంసీల నీరు వదిలారు. ప్రస్తుతం డ్యామ్‌లో 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● శ్రీరాంసాగర్‌కు 1.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 37 గేట్లు ఎత్తి 1.5లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



పండుగ ముగిసే.. పట్నం పిలిచే..

● రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీ



రేణికుంట టోల్ గేట్ వద్ద వాహనాల తాకిడి

తిమ్మాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు చేసుకునేందుకు సెలవులపై సొంత గ్రామాలకు హైదరాబాద్ నుంచి వచ్చిన జనాలు తిరిగి సెలవులు ముగియడంతో సోమవారం విధులకు, పాఠశాలలకు, కళాశాలలకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అందరు ఆదివారం పల్లెల నుంచి పట్నంబాట పట్టారు. దీంతో మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ పెరిగింది. దీంతో టోల్‌గేట్ వద్ద కరీంనగర్‌నుంచి హైదరాబాద్ వైపువెళ్లే వాహనాలు క్యూకట్టాయి. దీంతో వాహనాలు సుమారు కిలోమీటర్ మేరా క్యూలో నిలబడి మెల్లిగా వెలుతుండటంతో ప్రయాణికులు కొద్దిగా ఇబ్బందిపడ్డారు. టోల్‌గేట్ సిబ్బంది కూడా వాహనాలను త్వరగా పంపించేందుకు శ్రమించారు.

● మొరాయించిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు..

మండలంలోని రేణికుంట వద్ద టోల్‌గేట్‌కు సమీపంలో కరీంనగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రికల్‌బస్సు ఆదివారం ఉదయం మొరాయించింది. కరీంనగర్ నుంచి ప్రయాణికులతో సికింద్రాబాద్ బయలుదేరిన బస్సు టోల్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే ఆగిపోయింది. ఎంతసేపటికీ స్టార్ట్ కాక పోవడంతో అందులోని ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. చివరికివేరే బస్సును రప్పించి ప్రయాణికులను అందులో సికింద్రాబాద్‌కు పంపించారు.



నిలిచిపోయిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు

'కందేపి'కి గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారం ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ రాణిప్రసాద్

సిరిసిల్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ జాతీయస్థాయిలో గాంధీ ఇన్‌స్పిరేషనల్ పురస్కారం అందుకున్నారు. ఆదివారం పాన్ ఇండియా సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా హైదరాబాదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ రాణిప్రసాద్‌కు గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారాన్ని శాసన సభ మాజీస్పీకర్ మధుసూదనాచారి అందజేశారు. రాణి ప్రసాద్ పురస్కారం అందుకోవడంపై జిల్లా రచయితల సంఘం, మానేరు రచయితల సంఘం, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్య అమృతోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని రాణిప్రసాద్ 75చిత్రాలను తయారుచేశారు. అందులో స్వాతంత్రోద్యమ కవితలు, అమరవీరుల చిత్రాలు, జాతీయ పతాకాలు, భారతదేశ చిత్రపటాలను తయారుచేసి రెండు ఎగ్జిబిషన్‌లు నిర్వహించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతోఇష్టమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే సామివారిని దర్శించుకున్నారు.



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మైసమ్మ తల్లికి పూజలు

సుభాష్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మైసమ్మతల్లికి ఉమ్మడిజిల్లా నాలుగోతరగతి ఉద్యోగులసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి మాట్లాడుతూ మైసమ్మతల్లి దయ అందరిపై ఉండాలన్నారు. 20సంవత్సరాలుగా నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడిజిల్లా కార్యదర్శి శంకరయ్య, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రమేష్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కె.అరుణ, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జీవన్, నగర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, హుజురాబాద్ తాలూకా అధ్యక్షుడు కె.రమేశ్, సహాధ్యక్షుడు కె.సోమయ్య, కోశాధికారి లక్ష్మిరాజం, ఉపాధ్యక్షులు రాజలింగం, ఎం.అశోక్, సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, జె.రవీందర్ రిటైర్డ్ నాకులు, జిల్లా, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

● గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

భగత్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. చెట్టుపై నుంచిపడి మరణించిన, గాయాలపాలైన కార్మికులకు ఇస్తామన్న ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశీయ వస్తువులనే వాడాలని చెబుతున్నా నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి వెంకటనరసయ్య, సురుగు రాజేష్, జగిత్యాల జిల్లా కన్వీనర్ గర్వందుల రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

ఆండాళమ్మకు ఒడి బియ్యం సమర్పణ

● గజవాహనంపై శ్రీవారి ఊరేగింపు



ఓడి బియ్యం సమర్పించిన పద్మశాలి సంఘం మహిళలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణానికి చెందిన పలువురు దంపతులు దేవాలయంలో ఆండాళమ్మ(పద్మావతి)కు ఒడి బియ్యం సమర్పించారు. పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం పట్టణప్రధాన రహదారుల గుండా శ్రీవారు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతిరావు, అర్చకులు మాడంరాజు కృష్ణమాచార్యులు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు కామని వనితనళినీకాంత్, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గంబీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం శ్రీ హరి హర దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తుల కన్నుల పండువగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగింది. ఈనెల 3నుంచి 9వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 7న స్వామివారి గరుడసేవ, 8న రథోత్సవం జరగనుండగా, భక్తుల సౌకర్యార్థం ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



లింగన్నపేటలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు..

● ప్రశంసలందుకుంటున్న నర్మాల రైతు మల్లేశం

గంభీరావుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగులో పురుగు మందుల వాడకం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని గ్రహించాడు ఆ యువరైతు.. తనకున్న కొద్దిపాటి భూమిలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తూ.. మార్కెట్ ధరకంటే తక్కువకే ప్రజలకు విక్రయించడం ద్వారా పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన యువ రైతు మల్లేశం.. కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నాడు.

గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన యువరైతు బొంగు మల్లేశం సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న కూరగాయలను నేరుగా ప్రజలకు విక్రయిస్తూ పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. తనకున్న 10గుంటల వ్యవసాయ భూమిలో 12రకాల కూరగాయలను పండిస్తున్నాడు. బీరకాయ, బెండకాయ, కాకరకాయ. టమాట, దోసకాయ, కొత్తిమీర, గోంగూర, గోరుచిక్కుడు, చిక్కుడు, సోరకాయ, మిర్చి, మెంతికూరను సాగు చేస్తున్నాడు. ఎలాంటి రసాయన క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలను సాగుచేస్తున్నాడు. నర్మాలలో మార్కెట్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు కూరగాయల కోసం గంభీరావుపేటకు వెళ్లాల్సి వస్తోందని గ్రహించి కూరగాయలను సొంతంగా పండిస్తూ ఊరిలోనే కూరగాయలను మార్కెట్ ధరకంటే తక్కువ ధరకే విక్రయిస్తున్నాడు.

● పవర్ వీడర్‌తో కలుపు నియంత్రణ

కూరగాయల సాగులో కలుపు నియంత్రణకు కూలీల ఖర్చు అధికమవుతుందని మల్లేశం గ్రహించాడు. కలుపు నియంత్రణకు రూ.35వేలు వెచ్చించి పవర్ వీడర్‌ను కొనుగోలు చేశాడు. దీంతో కూలీల ఖర్చు తగ్గిందని, సాగుపనుల్లో కుటుంబ సభ్యులు సహకరిస్తుండటంతో కూలీల ఖర్చులేకుండా పోయిందని మల్లేశం తెలిపాడు.



మల్లేశం సాగు చేస్తున్న కూరగాయల మొక్కలు

● మహానంది అవార్డుకు ఎంపిక..

కొన్నేళ్ళుగా తైవాన్‌జామతో పాటు కూరగాయలను నూతన పద్ధతుల్లో సాగు చేస్తుండటంతో తెలుగు వెలుగు సాహితీవేదిక ఆధ్వర్యంలో మల్లేశం మహానంది అవార్డుకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభ కళావేదికలో ఇటీవల మల్లేశం మహానంది అవార్డును అందుకున్నాడు.

● కూరగాయల సాగుతో అదనపు ఆదాయం..

- మల్లేశం, యువరైతు, నర్మాల



సేంద్రియ పద్ధతిలో చేస్తున్న కూరగాయల సాగులో మంచి లాభాలు ఉన్నాయి. సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న కూరగాయలు రుచికరంగా ఉంటున్నాయి. కూరగాయల కోసం ఇంటి వద్దకే వచ్చి ప్రజలు నిత్యం కొనుగోలు చేస్తున్నారు. సాగు ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు కూరగాయల అమ్మకం ద్వారా ఆదాయం వస్తోంది.

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వెంకటస్వామి



ఖనిలో వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, సుల్తానాబాద్‌లో కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కేంద్ర మాజీమంత్రి జీ వెంకటస్వామి కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. కాకా 96వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్ వద్ద కాకా విగ్రహానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వెంకటస్వామి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాత్ర పోషించారన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల కోసం వేలాది గుడిసెలను ఇప్పించారని, సింగరేణి కార్మికులకు పెన్షన్ ఇప్పించిన ఘనత వెంకటస్వామికే దక్కుతుందన్నారు. చౌరస్తాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి, గుమ్మడి కుమారస్వామి, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, రాచకొండ కోటేశ్వర్లు, పాకాల గోవర్ధన్‌రెడ్డి, దుబాసి మల్లేష్, బోయిని మల్లేష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): వెంకటస్వామి జయంతిని కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి మాట్లాడారు. పేద ప్రజలు, కార్మిక కాకా చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు రాజేష్, నాయకులు సాగంటి శంకర్, చాట్ల సదానందం, దశరథంగౌడ్, మార్క రాజు, తిరుపతిరెడ్డి, రాములు, సారయ్యనాయక్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్రమంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతిని కాంగ్రెస్ నాయకులు, కాకా అభిమానులు ఘనంగా నిర్వహించారు. కాకా విగ్రహానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకట స్వామి ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు, కృషిని కొనియాడారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, అబ్బయ్యగౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, సజ్జాద్, ముస్త్యాల రవీందర్, బిరుదు కృష్ణ, శ్రీధర్, రాజలింగం, జాని, శంకర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నీరటి శంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం దివంగత కాంగ్రెస్ కురువృద్ధుడు, మాజీ కేంద్రమంత్రి కాకా గడ్డం వెంకటస్వామి జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గోప విజయ భాస్కర్‌రెడ్డి, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, కొరుకంటి వెంకటేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సు, నరహరి సుధాకర్ రావు, తాటిపల్లి రమేష్ బాబు, బడే స్వామి, కొండయ్య, కొండ తిరుపతి గౌడ్, అమ్ముల రమేష్, మండిగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో కాకా జన్మదిన వేడుకల్లో అభిమానులు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ సువర్ణ, గీస రాజు, చెవుల రాజయ్య, సాంబశివరావు, దేవిక, రమ, రమ్య, మౌనిక, సుమలత, లక్ష్మీ, సిద్దార్థ, రాజేశ్వరి పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతిని మండల కేంద్రంలో కన్నం భరత్, పాటకుల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కన్నం భరత్ మాట్లాడుతూ దళిత బడుగు బలహీన అణగారిన వర్గాల సంక్షేమానికి ఎనలేని సేవలందించారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చీదురు శ్రీనివాస్, కొట్టె నర్సయ్య, జెట్టి సతీష్, లింగయ్యగౌడ్, రవిందర్, లచ్చయ్య, కట్ల రాజేశం, కోరికంటి లచ్చయ్య, మోదుంపల్లి సతీష్, గనేష్, మోదుంపల్లి రవి, కన్నం రాములు, మాంకాలి పోచమల్లు, మల్లేశ్, మాంకాళి రాము పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి కాకా జయంతిని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో నాయకులు కాకా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొగరి తిరుపతి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు క్యాంపు ఆఫీసులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఎస్సీ సెల్ నేతలు మంథని సత్యం, బూడిద శంకర్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక నేతగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా వెంకటస్వామి పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి, తెలంగాణ సాధన కోసం చేసిన కృషిని, త్యాగాలను, పోరాటాలను కొనియాడారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దార మధు ఆధ్వర్యంలో మాజీ వెంకటస్వామి(కాకా) జయంతి నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సింగరేణి కార్మికులకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పెంటయ్య, శ్రీనివాస్, సత్తయ్య, శేషగిరి, రాజు, మొగిలి, కొవ్వూరి మల్లేష్, బాణేష్, లక్ష్మయ్య, రోహిత్, నాని, రషీద్, అక్రమ్ పాల్గొన్నారు.





జూలపల్లిలో వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలులు వేస్తున్న అభిమానులు, మాజీ ఎంపీ వెంకటస్వామి జయంతి వేడుకల్లో నేతలు

చేనేత వస్తువులను ప్రోత్సహించండి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మనాలీ ఠాకూర్

మార్కండేయకాలనీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్తువులను ప్రోత్స హించాలని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. ఆదివారం ఆర్‌జీ-1 కమ్యూనిటీ హాల్‌లో చేనేత హస్తకళ ప్రదర్శనను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ సం స్కృతికి చేనేత పరిశ్రమలు ఎంతో ముఖ్యమని, చేనేత పరిశ్రమల్లో మహిళలు తయారు చేస్తున్న వస్తువులను కొనుగోలు చేయడం వల్ల వారికి ఉపాధి లభిస్తుందని, చేతి వృత్తితో తయారు చేసిన అనేక వస్తువులను కళాకారులు వారి శ్రమతో తయారు చేయడం అభినందనీయమన్నారు. దేశీయ వస్తువులను ప్రోత్స హించి స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వాలని, మన సంస్కృతి, సాంప్ర దాయం, కళలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

ఐకమత్యంతో ఏదైనా సాధించవచ్చు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఐక మత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డే పల్లి రాంచందర్ అన్నారు. ఆదివారం సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని సిరి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలయ్ బలయ్ కార్య క్రమం ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొంది స్తుందని, ఒకరికి, ఒకరికి మధ్య మానవ సం బంధాలు పెరుగుతాయన్నారు. 13ఏళ్లుగా ఐక్య వేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ ఈ కార్య క్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు అనేక మంది సంఘ సంస్కర్తలు పని చేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 20రకాల తెలంగాణ వంటకాలు గడక, అంబలి, రాగి జావ, జన్న గడక, రాగి సంకటి, జొన్న రొట్టె, బోటి, తలకాయ, కాళ్ల, చికెన్, మటన తెలంగాణ వంటకాలను అందిం చారు. బండారి రాయమల్లు, సబ్బు మల్లయ్య, రెడ్డి భాస్కర్, దుబాసి బొందయ్య, మహేందర్, శ్రీనివాస్, గోపాల్, బొంకూరి మధు, సుల్వ లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలి



పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకు చేరే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో అంతర్గాం మండల కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించాలని, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పని చేయాలని నాయకులకు సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్

అంతర్గాం మండలం పొట్యాల మాజీ సర్పంచ్ వేల్పుల సమ్మయ్యతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, రాజేష్, తిరుపతి, శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాయకులను అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం కలిసికట్టుగా పని చేయాలని, పదవులు ప్రతి ఒక్కరికి వస్తాయని, ఎవరు అధైర్యపడకుండా పార్టీ గెలుపు కోసం పని చేయాలని, తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ హామి ఇచ్చారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లో పథసంచాలన్‌ను ఘనంగా నిర్వహించారు. స్వయం సేవకులు భారీ ఎత్తున పాల్గొని టీటీడీ కల్యాణ మండపం వరకు కవాతు నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ ప్రాంత కార్య వాహ కాచం రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ కేశవ్‌రావు బలిరామ్ పంత్ హెడ్గేవార్ (డాక్టర్ జీ) ఆర్ఎస్ఎస్‌ను మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 1925న విజయ దశమి రోజున పది మందితో ప్రారంభించారని గుర్తు చేశారు. నేడు కోట్లాది మంది స్వయం సేవకులను కలిగి, దేశ సమాజ సేవలో ప్రభావిత సంస్థగా మారిందన్నారు.

అవార్డు అందుకున్న సత్యప్రకాష్ రావు



అవార్డు అందుకుంటున్న సత్యప్రకాష్‌రావు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ బోధకుడిగా పని చేస్తున్న సత్యప్రకాష్‌రావు కరీంనగర్‌కు చెందిన ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ తరపున అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురు బ్రహ్మ అవార్డు పొందినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు గంగారపు మల్లేశం తెలిపారు. యేటా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయులతోపాటు సామాజిక సేవలకు వీటిని అందిస్తున్నామని తెలిపారు. సత్యప్రకాష్‌రావు ఆపదలో ఉన్న వారికి ఇప్పటివరకు 26 సార్లు రక్తదానం చేయడంతోపాటు ఎన్నో సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆయనకు అవార్డు రావడంపై ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయ బృందం, తారుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎల్లయ్య, సుమన్, విద్యార్థులు సంతోషం ప్రకటించారు.


దళితులకు అవమానం పై విచారణ

మంథని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్యాపూర్‌లో దసరా పండగ సందర్భంగా దళితులకు జరిగిన అవమానంపై గ్రామంలో ఆదివారం విచారణ జరిపినట్లు ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. ఇటీవల జరిగిన దసరా, బతుకమ్మ పండగల్లో గ్రామానికి చెందిన కిష్టయ్య, శ్రీనివాస్, తిరుపతి, రవిలు మాదిగలను అవమానపర్చినట్లు తెలిపారు. ఈఘటనపై విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గణేష్, అర్ల సందీప్, గొరైంకల సురేష్, లింగయ్యలు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో

- ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండిలోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో డ్యాం ఆరు గేట్లు ఎత్తి నీటిపారుదల శాఖ అధికారుల దిగువకు నీటిని విడుదల చేశారు. శనివారం రాత్రి రెండు గేట్లు ఎత్తిన అధికారులు, ఇన్‌ఫ్లో పెరగడంతో ఆదివారం మధ్యాహ్నం 1.30కు మరో నాలుగు గేట్లు ఎత్తారు. మిడ్ మానేరు నుంచి మూడ వేలు, మోయతుమ్మెద వాగు నుంచి 11,836, ఎగువ కాకతీయ కాలువ నుంచి 640, మొత్తం 15,476 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి ఎల్ఎండీలోకి వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా రెడు వేలు, ఆరు గేట్ల ద్వారా 16 వేలు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 277, మొత్తం 18,277 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరిగితే స్పిల్‌వే గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తామని, దిగువ ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు.



ఎల్ఎండీ స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

ప్రయాణికులతో కిటకిటలాడిన కరీంనగర్ బస్టాండ్



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

భగత్‌నగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలకు ఇళ్లకు వచ్చిన వారంతా తిరుగు పయనమయ్యారు. దీంతో కరీంనగర్ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. దసరా, బతుకమ్మ పండుగకు వివిధ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు తమ స్వగ్రామాలకు వచ్చారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో విద్యాసంస్థలు, కంపెనీలు, కార్యాలయాలు తెరుచుకోనుండడంతో తమ ప్రాంతాలకు వెళ్లడానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు తరలి రావడంతో కరీంనగర్ బస్టాండ్ కిక్కిరిసింది. ఆర్టీసీ బస్సులు ప్రత్యేక బస్సులు ఏర్పాట చేసినా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో సరిపోలేదు.సీట్లు దొరకడం గగనంగా మారిపోయింది.

బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని తిరుగు పయనమయ్యేందుకు బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీంతో ప్రైవేట్ వాహనాల వారు ప్రయాణికుల నుంచి అందిన కాడికి దండుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ప్రాంతం ప్రయానికులతో కిక్కిరిసి పోయింది.

బహుజనులకు రాజ్యాధికారం కల్పించిన కాన్షీరాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

సుల్తానాబాద్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ ద్వారా కాన్షీరాం దేశంలో బహుజనులకు రాజ్యాధికారాన్ని కల్పించడంతోపాటు వారిలో రాజకీయ చైతన్యాన్ని నింపారని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు అన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం సుల్తానాబాద్‌లో వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి అట్టడుగు వర్గాల మహిళ మాయవతిని సీఎం చేశారని, బహుజనులకు భూ పంపిణీతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పించారని అన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టె రాజు, అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, మండల అధ్యక్షుడు రంజిత్, ఓదెల మండల అధ్యక్షుడు పల్లె ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు మాతంగి శంకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలపై విస్తృత ప్రచారం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లిలో త్రైత సిద్ధాంతం భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు రాజు, రాకేష్, నాగిరెడ్డి రవి, వేణు, రాజు , సత్యం, సందీప్, ప్రసాద్, సతీష్, నరేందర్, ఉమ, సునీత, నాగమణి, రవళి, రష్మిత, సాహిత్, అణుతేజ్, ఆదిత్య రూపక్, శివిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

సుల్తానాబాద్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా బొల్లి సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో గురుస్ స్టూడెంట్స్ పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. బొల్లి సత్యనారాయణ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు. సొసైటీ చైర్మన్, జాతీయ అధ్యక్షుడు గంగారపు మల్లేశం జ్ఞాపిక అందించారు.

ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలి



కొదురుపాకలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

సుల్తానాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలతోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ పదవులను బీజేపీ అభ్యర్థులు కైవసం చేసుకోవాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కొదురు పాకలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా పని చేయాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్‌యాదవ్, మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, నాయకులు భూషణవేని మనోహర్, సట్టు శ్రీనివాస్, చాతరాజు అజయ్, రామగిరి రాజకుమార్, సట్టు మహేందర్, నరేష్, చాతరాజు బాలాజీ, వెంకటేష్, సతీష్, రాజు, ముప్పిడి మహేష్, కందుకూరి సుభాష్, కొండా రాకేష్, బాలాజీ, రాకేష్, పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి క్షేత్రానికి సామగ్రి అందజేత



కమాన్‌పూర్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి దేవాలయానికి దాతలు ఆదివారం పదివేల రూపాయల విలువ చేసే వీల్ చైయిర్‌తోపాటు మిక్సర్ గ్రైండర్‌ను అందజేశారు. దాతలు ఆడప లక్ష్మణ్, అనిత, రాంబాబు, ఆడప నరసింగం, శోభ, ఆడప రాజ్, లాక్షిత, రామ్ రాజ్, వేగోలపు మల్లయ్య గౌడ్, మాడిశెట్టి సతీష్, మాధవి, రాహుల్, రాగి సంతోష్ అందించారు. బీఆర్ఎస్ నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, బొమ్మగాని అనిల్ గౌడ్, పోలుదాసరి సాయి కుమార్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నబొంకూర్‌లో ఉచిత వైద్య శిబిరం

సుల్తానాబాద్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం చిన్నబొంకూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 150 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి రోగనిర్ధారణ చేశారు. మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ చిన్నబొంకూరు గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ అర్నకొండ రాజు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కుణాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతకు స్కూటీ అందజేత

సుల్తానాబాద్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసాల భక్త మార్కండేయ దేవాలయంలో చైర్మన్ వలస నీలయ్య ఆధ్వర్యంలో దుర్గామాత మండప నిర్వాహకులు దుర్గామాత ప్రతిష్టాపనకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో పలువురు భక్తులు స్వచ్ఛందంగా కూపన్లు తీసుకున్నారు. ఆదివారం లక్కీ డ్రాలో ప్రథమ బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటీ చిందం తిరుపతికి లభించింది. ద్వితీయ బహుమతి వాషింగ్ మిషన్ స్వప్నకాలనీకి చెందిన వినయ్, తృతీయ బహుమతిని పూసాలకు చెందిన కోడూరి సతీష్ గెలుపొందగా 32 ఇంచుల కలర్ టీవీ దక్కించుకున్నాడు. మున్సిపల్ కమిషనర్ రమేష్ అందించి, శుభాకాంక్షలు తెలిపారు.